1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఏప్రిల్ 07, 2025 | www.navatelangana.com

తాగు నీటి కోసం విద్యార్థుల అవస్థలు

నవతెలంగాణ-జైనూర్



మండలంలోని పాట్నాపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో తాగడానికి గుక్కెడు నీరు లేక విద్యార్థినీలు నానా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో విద్యుత్ సరఫరా నిలచిపోవడంతో పాటు బోర్వెల్ చెడిపోవడంతో తాగు నీరు లేక విద్యార్థులు అల్లాడిపోతున్నారు. ఇక చేసేదేమీ లేక స్థానిక గ్రామంలోకి వెళ్లి బోరింగ్ నీళ్లు తెచ్చుకొని వాటర్ బాటిల్లో నింపుకుంటున్నారు. అసలే ఎండాకాలం భానుడు భగభగ నిప్పులు చెరుగుతున్న వేళ చిన్నారులకు తాగు నీటి సరఫరా ఆగిపోవడం బాధాకరమని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతున్నారు.

ఆపరేషన్ కగర్ ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ఆపరేషన్ కగార్ ఉపసంహారణకై ఏప్రిల్ 8న ఇందిరా పార్క్ వద్ద జరిగే ప్రజాధర్నా ను జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఏరియా కార్యదర్శి దొండ ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసీ జాతి పతనానికి బీజేపీకి చెందిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హత్యాకాండకు తెగబడుతున్నాయని అన్నారు. చత్తీస్గడ్ రాష్ట్రంలో వందలాది మందిని ఎన్కౌంటర్ల పేరిట హత్య చేస్తున్నారని విమర్శించారు. ఈ హత్యాకాండను ప్రత్యేకించి ఆదివాసీ జాతిని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం హతమారుస్తున్న విధానాన్ని దేశంలోని రాజకీయ పార్టీలు ప్రజాసంఘాలు, మేధావులు తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూరు పటేల్, మెస్రం చిత్రు, కుసం లచ్చన్న, సోము, జంగు పాల్గొన్నారు.

మనువాద భావ జాలనికి వ్యతిరేకంగా పోరాడుదాం

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జ్‌రెడ్డి పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-మంచిర్యాల

ఉస్మానియా విద్యార్థి నాయకుడు జార్జ్‌రెడ్డి 53వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి శ్రీకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో జార్జ్‌రెడ్డి వర్ధంతి సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీలో మతోన్మాదానికి, మహిళలపై లైంగిక దాడులకు వ్యతిరేకంగా పిడికిలి బిగించి పోరాడిన విప్లవ, విద్యార్థి నాయకులు జార్జ్‌రెడ్డి అని కొనియాడారు. క్యాంపస్‌లో జరుగుతున్న అన్యాయాలను, విద్యార్థులపై జరుగుతున్న దాడులను ఎదిరించిన విప్లవకారుడని అన్నారు. సమసమాజ స్థాపనకు ఉద్యమిస్తున్న జార్జి రెడ్డి ఎదుగుదలని జీర్ణించుకోలేని మతోన్మాద గుండాలు హత్య చేశారని, ఆయన ఆశయాల సాధనకై పోరాడాలని, జర్జ్‌రెడ్డి అమరత్వాన్ని స్మరించుకుంటూ నిర్వహించే వర్ధంతి సభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.సికిందర్, సభ్యులు శశి కుమార్, సిద్ధార్థ, వంశీ, అనిల్ పాల్గొన్నారు.

పెండిగ్ ప్రమోషన్లు వెంటనే ప్రకటించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణివ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లను వెంటనే ప్రకటించాలని, అర్హులైన వారికి ఉద్యోగోన్నతులు కల్పించాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. రామగుండం పర్యటనలో ఉన్న డైరెక్టర్ (పీ అండ్ పీ, పీఏ అండ్ డబ్ల్యూ) వెంకటేశ్వర్లుకు సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్(బిఎంఎస్) ఆధ్వర్యంలో ఆదివారం మెమోరాండన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు నాతాడి శ్రీధర్ రెడ్డి, యూనియన్ నాయకులు తిరునహరి, కిరణ్ కుమార్, బుర్ర అరుణ్ కుమార్, ఆషాడపు రమేష్, చల్ల వేణు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని మద్దిమాడ గ్రామానికి చెందిన యువకుడు సంద్ర అనిల్ అదృశ్యంపై మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు.. అనీల్ శుక్రవారం తన అన్న అశోక్ వద్దకు వెళ్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఆ రోజు నుంచి అనిల్ కనిపించకపోవడంతో తన తండ్రి లక్ష్మణ్ ఆదివారం ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బెట్టింగ్‌పై పోలీసుల నిఘా..!

- పట్టుబడుతున్న పలువురు యువత
- మానుకోవాలని పోలీసుల సూచన
- ఇప్పటి వరకు నాలుగు కేసులు నమోదు

బెట్టింగ్‌తో జీవితాలు తారుమారవుతాయి. ఈ మహమ్మారి బారిన పడి అనేక మంది యువత ఆర్థికంగా, మానసికంగా నష్టపోతున్నారు. జిల్లాలో బెట్టింగ్‌ను నిర్మూలించేందుకు పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. బెట్టింగ్‌కు పాల్పడుతున్న పలువురిని పట్టుకున్న పోలీసులు కేసులు నమోదు చేశారు. యువత బెట్టింగ్ మానుకోవాలని సూచిస్తోంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేటి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం, సోషల్ మీడియా ప్రభావం బాగా పెరిగి ప్రతి ఒక్కరికి ఇంటర్నెట్ అందుబాటులో ఉంటుంది. దీంతో కొన్ని సందర్భాల్లో అవగాహన లోపం వల్ల చాలామంది యువత ప్రజలు ఆన్‌లైన్ గేమింగ్ బెట్టింగ్ బారినపడి డబ్బు అత్యాశతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోసగాళ్ల మోసపూరిత ప్రకటనలు సందేశాలు చూసి మోసపోతూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడటం గుర్తింపు లేని అంతర్జాల సంస్థల్లో డబ్బులు పెట్టుబడి పెట్టి చాలా మంది ఆర్థిక నష్టాల బారిన పడుతున్నారు. తద్వారా తమ జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా అక్రమ బెట్టింగ్‌లు నిర్వహించిన, బెట్టింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరిస్తున్నారు. యువత, విద్యార్థులు అక్రమ బెట్టింగ్ యాప్స్‌కి అలవాటు పడి అప్పులపాలై ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని, అక్రమ బెట్టింగ్ యాప్స్‌లతో బెట్టింగ్‌కు పాల్పడిన, గేమింగ్ యాప్స్‌లలో గేమింగ్ ఆడిన, ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. బెట్టింగ్‌పై జిల్లాలో పూర్తి నిషేధించినట్లు పేర్కొన్నారు. ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహించిన పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

బెట్టింగ్ నిర్వహిస్తూ పట్టుబడి..

పట్టణంలోని రాంనగర్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న షేక్ రియాజ్, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ ఆల్ ప్యానెల్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తూ ఉండగా పట్టుబడ్డారు. ఇతనితో పాటు మహారాష్ట్ర కిన్వట్‌కు సంబంధించిన ఆరిఫ్, లడ్డూ చౌహాన్‌లపై కూడా సీఆర్ నెంబర్ 128/2025, అండర్ సెక్షన్ 9(1) టీఎస్ గేమింగ్ యాక్ట్‌తో మావల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇతని వద్దనుంచి ఒక మొబైల్ ఫోన్ రూ.ఐదువేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

అత్యశ చూపి అమాయక ప్రజలకు ఎర..

పట్టణంలోని పిట్టలవాడకు చెందిన గంధాడే సోహన్ అమాయక ప్రజల వద్ద డబ్బులు అత్యాశ చూపి క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు అతనిని మావల పార్క్ వద్ద మావల పోలీసులు పట్టుకున్నారు. ఇతని వద్ద నుంచి ఒక సెల్ఫోన్ రూ. ఐదువేల నగదు స్వాధీనం చేసుకొని, మావల పోలీస్ స్టేషన్‌లో సీఆర్ నెంబర్ 129/2025, అండర్ సెక్షన్ 9(1) టీఎస్ గేమింగ్ యాక్ట్‌తో కేసు నమోదు చేశారు.

వన్‌టౌన్ పరిధిలో ఇద్దరిపై కేసు..

ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భుక్తాపూర్ కాలనీలో ఖిల్లా ఏరియాకు సంబంధించిన సుల్తాన్, ఒక మైనర్ సెల్ ఫోన్‌లో ఓ యాప్ ద్వారా ఆన్‌లైన్ బెట్టింగ్ పాల్పడుతున్నారు. వారిపై పీఎస్‌లో సీఆర్ నెంబర్ 151/2025, అండర్ సెక్షన్9(1) టీఎస్ గేమింగ్ యాక్ట్‌తో కేసు నమోదు చేశారు. వీరు ఇద్దరు గత రెండు రోజులలో ఆన్‌లైన్ బెట్టింగ్ ద్వారా రూ.15 వేలను పోగొట్టుకున్నారు.

యువత ఆన్‌లైన్ బెట్టింగ్ వైపు వెళ్లోద్దు

బెట్టింగ్‌కు పాల్పడటం బెట్టింగ్ నిర్వహించడం బెట్టింగ్‌ని ప్రోత్సహించడం చట్ట ప్రకారం నేరం. ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహించే వారిపై జిల్లా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఇంట్లో తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిఘా పెట్టాలి. ప్రతిరోజు పిల్లలు వారు చేస్తున్న పనుల గురించి ఆరా తీయాలి. క్రికెట్ బెట్టింగ్ ప్లేయింగ్ కార్డ్స్ బెట్టింగ్ యాప్స్ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రోత్సహించే వారిపై నిర్వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లు ఆయా యాప్ నిర్వాహకుల సూచనల మేరకే పని చేస్తాయి.



ఆదివాసుల హక్కుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

నవతెలంగాణ-సిరికొండ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఆదివాసీ నాయకులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసుల హక్కుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తుడుం దెబ్బ రాష్ట్ర కోకన్వీనర్ గోడం గణేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఈనెల 12, 13, 14 తేదీలలో ఆదివాసుల కోసం జోడేఘాట్‌లో తుడుం దెబ్బ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన పోరాటాలలో తన పాత్రను పోషించి, బీఆర్ఎస్ లాంటి పార్టీలు పుట్టకముందే తెలంగాణ కోసం ప్రజా సంఘాలతో, పార్టీలతో జతకట్టి ఐక్య సంఘటనలను ఏర్పాటు చేసి తుడుం దెబ్బ పోరాటం చేసిందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పడిన తర్వాత ఆదివాసీ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలతో తమ అస్తిత్వాన్ని ఆదివాసులు కోల్పోతారని, తమ ప్రత్యేక రాజ్యాంగ హక్కులు ఆదివాసులు కోల్పోయి, అన్యాయానికి గురవుతున్నారని అన్నారు. ఆదివాసుల ప్రత్యేక విధానాన్ని తెలంగాణ పోరాటాల సమయంలోనే తెలంగాణ పోరాటవాదుల ముందర తుడం దెబ్బ పెట్టిందని అన్నారు. కానీ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గిరిజనేతరుల వలసల ద్వారా ఆదివాసీ ప్రాంతాలలో దోపిడీ పెరిగిపోయిందన్నారు. ఆదివాసులు రాజ్యాంగ హక్కులపై గిరిజనేతుల దాడి విపరీతమైందని అన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే షెడ్యూల్ ప్రాంత జీవోలు మసకబారి పోయి, ఆదివాసులు ప్రత్యేక అభివృద్ధి సంస్థలు సన్నగిల్లిపోయాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ మండలాధ్యక్షుడు యాదవ్‌రావ్, రిమ్మ సార్మేడి అమృత్‌రావ్, తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోజ్, ప్రకాష్, మహదు, గణపతి పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

మనమంతా కలిసికట్టుగా ఉండి తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకరావాలని సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్మల్ రూరల్ మండలంలోని తల్వేద గ్రామంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. పార్టీ పతాకాన్ని బూత్ అధ్యక్షుడు ఎలిశెట్టి అజెయ్ ఎగురవేశాడు. ఈ సందర్భంగా రాంనాథ్ మాట్లాడుతూ సమర్థత సుస్థిరత పాలన అందిస్తున్న నరేంద్ర మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అన్ని వర్గాలు ఆకర్షితులౌతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తోకలు అనిల్, నరేందర్, రాజేందర్, ఉపసర్పంచ్ పోశెట్టి, వార్డు మెంబర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో...

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నర్సాపూర్ మండల కేంద్రంలో బీజేపీ జెండాను సత్యనారాయణగౌడ్ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1980లో ఇద్దరు ఎంపీలతో ప్రారంభమైన పార్టీ నరేంద్ర మోదీ నాయకత్వంలో మూడు సార్లు అధికారం సాధించి, ప్రపంచంలో అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా ఎదిగిందని, అలాంటి పార్టీకి రానున్న రోజుల్లో తెలంగాణలో అధికారం సాధించేందుకు మీరందరు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బర్కుంట నరేందర్, జిల్లా కార్యదర్శి రాజేందర్, నాయకులు సవీన్, దత్తురాం, సుధాకర్, సాయన్న, బూత్ అధ్యక్షులు రాకేష్, గంగారాం, శంకర్, అశోక్, హనుమండ్లు, జిల్లా, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణోత్సవం



ఆదిలాబాద్ టౌన్ : పట్టణంలోని రామాలయంలో సీతారాముల కల్యాణానికి హాజరైన భక్తులు

నవతెలంగాణ-జైనథ్

నేడు ప్రపంచ దేశాలు సైతం హిందూ ధర్మం, సంప్రదాయాల వైపు చూస్తున్నాయని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ పేర్కొన్నారు. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని బోరజ్, పిప్పర్‌వాడ రామాలయంలో నిర్వహించిన, స్వామివారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గంలో ఇప్పటి వరకు 40 రామాలయాలు నిర్మాణం జరిగిందన్నారు. శాంతినగర్ శ్రీరామాలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తను వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు బీజేపీ నాయకులు అశోక్‌రెడ్డి, ముకుంద, రత్నాకర్‌రెడ్డి, ఆదిత్య, భూమన్న, సుభాష్, రాజు, రాజన్న ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మావల గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన శ్రీ రామనవమి వేడుకల్లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా ఉదయం స్వామి వారి పల్లకి వేడుకల్లో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు చప్పుల్ల నడుమ సీతా రాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమల్లో మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజి ఎంపీపీ గోవర్ధన్, మాజీ ఎన్ఎస్‌యూఐ నాయకులు నరసింహా, సీనియర్ నాయకులు నవీన్‌రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కుదురుపాక సురేష్, ప్రేమల, బాలకృష్ణ, లస్మన్న, వెంకటేష్, ముర్తుజా, దినేష్, అడెల్లు, పెటన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.



ఆదిలాబాద్ రూరల్‌లో..

ఆదిలాబాద్‌టౌన్ : జిల్లాలో ప్రజలు శ్రీరామ నవమి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. పలు ఆలయాలలో ప్రత్యేక కార్యక్రమాలు సీతారాముల కళ్యాణంతో పెద్ద సంఖ్యలో భక్తుల సందడి కనిపించింది. పట్టణంలోని తిర్పెల్లి రామాలయం, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్‌లోని సీతా రామంజనేయ ఆలయంలో, తదితర ఆలయాల్లో సీతారాముల కళ్యాణం కన్నుల పండవగా జరిగింది. ఉదయం నుండే ఆలయాలకు దైవ దర్శనం కోసం భక్తులు క్యూకట్టారు. అటు పెద్ద సంఖ్యలో భక్తుల రాకను దృష్టిలో పెట్టుకుని ఆలయాల కమిటీలు చలువ పందిళ్లు, టెంట్లతో ఎండ వేడిమికి భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వేద పండితుల మంత్రాల మధ్య అభిజిత్ లగ్న సుమూహుర్తాన శ్రీ సీతారాముల కమనీయ కళ్యాణ ఘట్టాన్ని ఆలయాల్లో ప్రత్యక్షంగా తిలకించి భక్తులు పులకించిపోయారు. కళ్యాణం అనంతరం భక్తలకు మహాన్నదాన ప్రసాద వితరణ చేపట్టారు.

నేరడిగొండ : మండల కేంద్రంలో ఆదివారం శబరిమాత ఆశ్రమంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. అనంతరం శ్రీ శబరిమత ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ రామనవమి సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని సన్మానించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వడూర్ ఎంపీటీసీ పండరి, శంతాపూర్ మాజీ సర్పంచ్ తిరుమల్ గౌడ్, జాదవ్ దాస్‌రాజ్, గ్రామస్తులు, రవీందర్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



నేరడిగొండలో..

నిర్మల్‌టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆదివారం శ్రీ రామ నవమి సందర్భంగా దేవరకోట ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్మల్ జిల్లా హిందూ వాహిని, భజరంగ్ దల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన భారీ శోభయాత్రలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, నిర్మల్ డివిజన్ ఏఎస్పీ రాజేష్ మీనన్, హిందూ వాహిని ప్రాంత సంఘటన మంత్రి యాదిరెడ్డి, ఛత్రపతి శివాజీ యువసేన అధ్యక్షులు యోగేష్ ప్రభు, జాదవ్ విఠల్, హిందూ సంఘాల ప్రముఖులు, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని కజ్జర్ల గ్రామంలో గల రామ మందిరంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఆదివారం ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వేద పండితుల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. కజ్జర్ల గ్రామస్తులు గత కొద్ది సంవత్సరాల క్రితం రామ మందిరాన్ని నిర్మించుకోగా ప్రతి ఏటా శ్రీరామ నవమి పండుగ సందర్భంగా సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని తాళిబొట్టు అక్షింతలతో పెళ్లి వేడుకగా నిర్వహిస్తారు. ఈ కళ్యాణ మహోత్సవంలో గ్రామస్తులు చింతలపల్లి దేవారెడ్డి, మోహన్‌రెడ్డి, కిరణ్ కుమార్, ఎల్మ నారాయణరెడ్డి, పూర్ణచందర్, స్వామిరెడ్డి, పోతన్న, సాగర్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా సీఆర్ఆర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ జిల్లా ప్రజల గుండెల్లో మాజీ మంత్రి రామచంద్రారెడ్డి చిరస్థాయిగా నిలిచారని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం తన నివాసంలో దివంగత చిలుకూరి రామచంద్రారెడ్డి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ చేసి, ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తన జీవితం మొత్తం ప్రజా సేవకే అంకితం చేసి, తన చివరి క్షణం వరకు ఆదిలాబాద్ ప్రజల బాగోగుల కోసమే పనిచేసిన వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజి ఎంపీపీ గోవర్ధన్, కోఆప్షన్ మెంబర్ రహీం ఖాన్, మాజీ ఎన్ఎస్‌యూఐ నాయకులు నరసింహా, సీనియర్ నాయకులు నవీన్‌రెడ్డి, మహ్మద్ వసీముద్దిన్, మద్దెల శ్రీనివాస్, కుదురుపాక సురేష్, జుబేదా, ఖమర్ బేగం, ప్రేమల, బాలకృష్ణ, ఎస్‌కె రహీం, లస్మన్న, ఎండి అఫ్సర్, వెంకటేష్, ముర్తుజా, దినేష్, అఫ్సర్‌ఖాన్, అలీం, సెముల్లాఖాన్, అడెల్లు, పెటన్న, మన్సుర్ భాయ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ శ్రేణులు ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పేద బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడిన నాయకుడిగా సీఆర్ఆర్ గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్‌రావు పాటిల్ అన్నారు. ఉమ్మడి జిల్లాకు ఆయన అందించిన సేవలను నాయకులు కొనియాడారు. రిమ్స్ ఆస్పత్రి కోసం సీఆర్ఆర్ ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అంతా కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్‌రావు, పట్టణాధ్యక్షులు గుడిపల్లి నగేష్, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగెల నర్సింగ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, నాయకులు యెల్టీ భోజారెడ్డి, సుధాకర్‌గౌడ్, ఎంఏ కయ్యుమ్, అశోక్, రామ్, ఎల్మ రామ్ రెడ్డి ఉన్నారు.

ఘనంగా సీఆర్ఆర్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



మాజీ మంత్రి చిల్కూరి రామచంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకొని ఆయన నివాసంలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. దీనికి మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, కౌన్సిలర్ అంబకంటి అశోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ ఆయన బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న కండక్టర్, డ్రైవర్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



నిర్మల్ నుంచి రాంపూర్ ప్రయాణిస్తున్న బస్సులో ఆదివారం ఒక మహిళ తన పర్స్ మరచిపోవడం జరిగిందని, గమనించిన కండక్టర్ నారాయణ, డ్రైవర్ మధు, కంట్రోలర్ ఎస్ఆర్‌రెడ్డి పర్సులో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా ఆమెను పిలిపించి, ఆమెకు పర్సును అందజేశారు. అందులో పదివేల రూపాయలు ఉన్నాయి. ఈ సందర్భంగా నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ సిబ్బందిని డిపోమేనేజర్ కే.పండరి, అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్ పలువురు అభినందించారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజులు సత్తా చాటాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రంలో అత్యధిక సామాజిక వర్గంగా ఉన్న ముదిరాజులు రాజ్యాధికారం లక్ష్యంగా ముందుకు సాగుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ సత్తా చాటాలని ముదిరాజ్ సంఘం పట్టణ అధ్యక్షులు ధారవేణి రాము ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి దార్ల రవి, కోశాధికారి బొజ్జ సంతోష్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని శాంతినగర్ చౌరస్తాలో ముదిరాజ్ సంఘం జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో సైతం అధిక జనాభా కలిగిన ముదిరాజులు రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తగినన్ని కౌన్సిలర్ స్థానాలను గెలుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర బీసీ జనాభాలో ప్రథమ స్థానంలో ఉన్న ముదిరాజులకు అన్ని రాజకీయ పార్టీలు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎన్నికల నేపథ్యంలో ముదిరాజులను మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేసి తర్వాత విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే రాష్ట్ర క్యాబినెట్‌లో ముదిరాజులకు సముచిత స్థానం దక్కనుందని, అదేవిధంగా ఓ జాతీయస్థాయి పార్టీకి రాష్ట్ర నాయకుడిగా ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని, ధీమా వ్యక్తం చేశారు. ముదిరాజులు మరింత ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఉగాది నుంచి ప్రారంభమైన జెండా ఆవిష్కరణ కార్యక్రమం జూన్ వరకు నిరంతర ప్రక్రియగా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పోలీస్ సమాజ్ జాతీయ కార్యవర్గ సభ్యులు నారాయణ ముదిరాజ్, మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలేంద్ర శివయ్య ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు బొజ్జ నారాయణ ముదిరాజ్, నాయకులు బొమ్మెన లక్ష్మన్న ముదిరాజ్, నగేష్, రాజేష్, వెంకటి, పోచ్చన్న పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు ఎంపికైన యువకులకు సన్మానం



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని బెల్గాం గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు ఇప్ప నిఖిల్, బొబ్బిలి యోగేష్ ఇద్దరు యువకులకు ఇటీవల వెలువడిన అగ్ని వీర్ ఫలితాల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించారు. కాగా విద్యార్థులకు ఆదివారం గ్రామస్తులు, యువకులు శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల మండలం నుంచి బెల్గాం గ్రామం నుంచి ఒకే సారి ఇద్దరు యువకులకు ఉద్యోగం రావడంతో గ్రామస్తులు వారికి అభిందించారు. అదే విధంగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క యువకుడు ఆ ఇద్దరి యువకులను ఆదర్శంగా తీసుకొని మరిన్ని కొలువులు సాధించేలా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు లక్ష్మణ్, చరణ్, గ్రామస్తులు ఉన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-కడెం

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాని ఆదివారం బీజేపీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిర్మల్ జిల్లా బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ హాజరయ్యారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని, మండల కేంద్రంలోని రామాలయంలో అలాగే సారంగాపూర్, మొర్రిగూడ, బెల్లాల్ గ్రామాలలో నిర్వహించిన సీతారాముల కల్యాణ వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలయా, రమణరెడ్డి, శ్రీరామ్, రంజిత్ పాలకుర్తి నగేష్, శనిగారపు లక్ష్మణ్ పాల్గొన్నారు.

జగదాంబ ఆలయాన్ని దర్శించుకున్న భుక్యా జాన్సన్ నాయక్

నవతెలంగాణ-పెంబి

శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని తాటిగూడ, లోతోర్య తండా జగదాంబదేవి, సేవలాల్ మహారాజ్ ఆలయాలను బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భుక్యా జాన్సన్ నాయక్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులు, జగదాంబ దేవి, సంత్ సేవాలాల్ మహారాజ్, ప్రకాష్ మహారాజ్ ఆశీస్సులు మన అందరిపై ఎల్లప్పుడూ ఉండాలన్నారు. ఆయన వెంట పెంబి మండల ముఖ్య నాయకులు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సైబర్ ఉచ్చులో పడి బలవుతున్న బాధితులు

- పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాలు
- తీవ్రంగా నష్టపోతున్న బాధితులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ స్కామ్‌లు, సైబర్ నేరాలు పెరిగాయి. ఆన్‌లైన్ వేదికగా స్కామర్లు రోజుకో తరహా స్కామ్‌తో అమాయకుల నుంచి అడ్డంగా దండుకుంటున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రాం, టెలిగ్రాం, వాట్సాప్ స్కామ్‌లతో చెలరేగిన సైబర్ నేరగాళ్లు బాధితులే లక్ష్యంగా లేటెస్ట్‌గా వివిధ రకాలుగా దోచుకుంటున్నారు. లింక్‌లు క్లిక్ చేయడం, ఆన్‌లైన్ టాస్కులు పూర్తి చేయడం వంటి ట్రిక్స్‌ను ఉపయోగిస్తున్నారు. ఈ తరహా మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆయా యాప్ యూజర్లను హెచ్చరించింది. పట్టణంలో విస్తృతంగా సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్నారు. సైబర్ క్రైమ్ గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సైబర్‌క్రైమ్. గావ్. ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ వారం జిల్లా వ్యాప్తంగా ఎనిమిది సైబర్ క్రైమ్ నేరాలు జరుగగా బాధితులు ఫిర్యాదు చేశారు.

ట్రేడింగ్ చేసి నష్టాల్లో పడేసి..

పట్టణానికి చెందిన ఓ వ్యక్తి అత్యధిక డబ్బును ఆన్‌లైన్ స్టాక్ మార్కెట్ ద్వారా సంపాదించి పెడతానంటూ చెప్పడంతో తన సొంత వివరాలు ఆధార్ కార్డు పాన్ కార్డు లాంటి వివరాలతో ఒక డిమార్ట్ అకౌంట్ తెరిచాడు. అందులో రూ.5, 29, 503 విడతల వారీగా వేశారు. అందుకు గాను సైబర్ నేరగాడికి తన వ్యక్తిగత సమాచారం పూర్తిగా ఉన్నందున ఆ డిమార్ట్ అకౌంట్‌లో బాధితునికి తెలియకుండా ట్రేడింగ్ చేసి నష్టాల బారిన పడేశాడు. ఈ మేరకు బాధితుడు మావల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

థర్డ్ పార్టీ అప్లికేషన్‌తో డేటా చోరీ...

పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి లోన్ అప్లికేషన్ ఆన్‌లైన్ ద్వారా థర్డ్ పార్టీ అప్లికేషన్ వేసుకున్నాడు. తన ఫోన్‌లోని అన్ని పర్మిషన్లు ఇవ్వడం వల్ల, తన వ్యక్తిగత సమాచారం అంతా ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ నేరస్తులు తస్కరించాడు. తన ఫోటోలను నగ్నంగా మార్ఫింగ్ చేసి తన మిత్రులకు కుటుంబ సభ్యులకు ఫోటోలను వీడియోలను పంపిస్తానని బెదిరించాడు. చేసేదేమీ లేక బాధితుడు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు.

వాట్సప్ హ్యాక్ చేసి నగదు చోరీ...

తాంసి మండలంలోని ఒక మహిళ తన వాట్సప్ గ్రూపులో ఉన్న ఒక అప్లికేషన్‌ను ఇంస్టాల్ చేసుకుంది. అంతే ఆమె వాట్సప్‌ను సైబర్ నేరగాళ్ల హ్యాక్ చేశారు. హ్యాకింగ్‌తో సైబర్ నేరగాళ్ల ఆమె యూపీఐ నుంచి దాదాపు రూ.5 వేలను కాళీ చేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆన్‌లైన్ కాల్‌కు బాధితుడు బలి

బజార్‌హత్నూర్ మండలంలో ఓ వ్యక్తి కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సైబర్ నేరగాళ్లు బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ చేశారు. దీంతో బాధితుడు తన వ్యక్తిగత వివరాలను తెలియజేశాడు. అంతే ఆన్‌లైన్ మోసగానికి వల్ల రూ.19,600 నష్టపోయాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది.

అప్రమత్తతే పదునైన ఆయుధం...

ఎస్పీ అఖిల్ మహాజన్

సైబర్ క్రైమ్ నేరాలను అడ్డుకట్ట వేయాలంటే ప్రజలకు అప్రమత్తతే పదునైన ఆయుధం. అప్రమత్తత వల్ల ఎలాంటి సైబర్ క్రైమ్ నేరాలు జరగకుండా ఉంటాయి. ప్రజలకు యువత, ప్రజలు ముఖ్యంగా ఆన్‌లైన్‌లో థర్డ్ పార్టీ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోకుండా ఉండాలి. డబ్బు అత్యశకు పోయి ఎవరు తమ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులకు తెలుపొద్దన్నారు. నకిలీ లోన్ యాప్స్, నకిలీ వెబ్‌సైట్లతో అప్రమత్తంగా ఉండాలి సైబర్ నేరాల బారిన పడకుండా ఉండాలి.



రణదివే స్ఫూర్తితో హక్కుల సాధనకు పోరాడుదాం

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీటీ రణదివే స్ఫూర్తితో సమస్యల పరిష్కారంకోసం హక్కుల సాధనకోసం పోరాటాలకు కార్మికులు సన్నద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో స్వాతంత్ర్య సమర యోధుడు సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షులు బీటీ రణదివే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీటీ రణదివే స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని పుణికిపుచ్చుకుని సహాయ నిరాకరణ ఉద్యమం మొదలుకుని అనేక పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. జైలు జీవితాన్ని సైతం అనుభవించారని, భారత దేశంలో సమసమాజం రావాలని కాంక్షించిన వారిలో బీటీ రణదివే ఒకరని అన్నారు. స్వాతంత్ర్యానంతరం కూడా కార్మిక ప్రజా హక్కుల సాధన కోసం అనేక పోరాటాలను నిర్వహించారని గుర్తుచేశారు. 1970లో సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడిగా భారతదేశ కార్మికోద్యమ, సమ్మెలకు నాయకత్వం వహించారని అన్నారు. కార్మిక వర్గ ఐక్యత పోరాటాలే సమస్యలకు పరిష్కారమని ఉద్ఘాటించారు. బీటీ రణదివే స్ఫూర్తితో భారత కార్మికలోకం ఏకం కావాలన్నారు. తమ హక్కుల సాధనకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాలని, లేబర్ కోడ్ల రద్దు 8 గంటల పనిదినాన్ని కాపాడుకోవడం, కనీస వేతనాలను సాధించుకోవడం, ప్రజారంగ సంస్థల పరిరక్షణ కోసం బీటీ రణదివే స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు కార్మికలోకం సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐ 8 జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.నవీన్ కుమార్, నాయకులు రేసు సురేందర్, దశాంత్, పొచ్చన్న, వినిత్, చరణ్, మణి పాల్గొన్నారు.



ఆదిలాబాద్ టౌన్: రణదివే చిత్రపటానికి పూలమలవేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి

ఇంద్రవెల్లి : బీటీ రణదివే ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని ధనోర గ్రామంలో ఆయన వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీటీ రణదివే ఆనాడు గోపాలకృష్ణ గోఖలే చేస్తున్న స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. గాంధీజీ చేసిన సహాయ నిరాకరణ ఉద్యమంలో సైతం పాల్గొన్నారని పేర్కొన్నారు. 1928లో కమ్యూనిస్టు సిద్ధాంతాలతో ఆకర్షితులై ఆ పార్టీలో చేరారన్నారు. క్రాంతి అనే దినపత్రికకు నడిపారన్నారు. ఆనాడు కార్మికుల హక్కుల కోసం అనేక వ్యాసాలు రాసి ఎనలేని కృషి చేశారన్నారు. అది సహించలేక బ్రిటిష్ ప్రభుత్వం ఆయనకు అనేక సార్లు జైల్లో వేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు దిల్దార్, అంగన్‌వాడీలు ఖుశీవర్త, ఆశ వర్కర్ కమల, పంచాయతీ కార్మికులు ఆనంద్, సంతోష్, కాంతం, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి : రణదివే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-తలమడుగు

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యతని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఉండం నుంచి సుంకిడి గ్రామం వరకు జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేపట్టారు. ముందుగా సుంకిడి గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, బీజేపీ నాయకులు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీస్తు, అప్రజాస్వామ్య పాలనను కొనసాగిస్తుందన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులను కాలరాస్తూ, వారికి అనుకూలంగా చట్టాన్ని అమలు చేసుకుంటున్నారని తెలిపారు. భారతదేశ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో భారత దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించినప్పటికీ, బీజేపీ అధికార పార్టీ పార్లమెంట్‌లో వారికి అనుకూలంగా రాజ్యాంగ సవరణ చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు గోక గణేష్‌రెడ్డి, బాబన్న, కాంగ్రెస్ మండల కన్వీనర్ కళ్యాణం రాజేశ్వర్, బోథ్ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి, మండల యూత్ అధ్యక్షులు చెన్నల సాయికిరణ్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, వెంకన్న యాదవ్, కమలాకర్, రమేష్‌రెడ్డి, రఘు, గంగారాం, గణేష్, లోక ప్రవీణ్‌రెడ్డి, నడిపెన్న, సల్ల దేవన్న, బాబు ఖాన్, మహాజన్ గంగారాం, ప్రతాప్, పోతయ్య, బాబన్న, రామ్‌చందర్ దేశ్‌ముఖ్, పోశెట్టి, నారాయణ, రాకేష్, పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సేవాలాల్ దీక్ష విరమణ



నవతెలంగాణ-నార్నూర్

శ్రీ రామనవమితో బంజారా సేవాలాల్ దీక్షా పరులు దీక్ష విమరణ చేశారు. 41 రోజుల దీక్షలు చేపట్టి ఆదివారం తండాలో జగదాంబ దేవి సేవాలాల్ ఆలయంలో భోగ్ బండార్ పూజలు చేసి, మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని లక్ష్మీ మాత ఆలయ మూడవ వార్షికోత్సవ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేసి భోగ్ బండార్ నిర్వహించారు. ఆధ్యాత్మికతతో మనసుకు ప్రశాంతతను కలిగిస్తుందని అన్నారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రాథోడ్ ఉత్తమ్, ప్యాక్స్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, మాజీ ఉపసర్పంచ్ చవాన్ మహేందర్, న్యానోబా పుష్కర్ ఆయా గ్రామాల నాయక్, కారోబార్‌లు పాల్గొన్నారు.

స్పెషల్ తలంబ్రాల బుకింగ్ కౌంటర్ ఏర్పాటు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ రామాలయంలో శ్రీ రామ నవమి సందర్భంగా భక్తులు భద్రాచలం వెళ్లలేని వారి సౌకర్యార్థం ఆర్టీసీ లాజిస్టిక్స్ వారు స్పెషల్ తలంబ్రాల బుకింగ్ కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవంలో ఓల్డ్ హౌసింగ్ బోర్డ్ కాలనీ మాజీ కౌన్సిలర్ అంబకంటి అశోక్ పాల్గొని ప్రారంభించారు. ఆయన కూడా తలంబ్రాలను బుక్ చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సాయన్న, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ అన్సారీ, భక్తులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలి

నవతెలంగాణ-జైనథ్

మండలంలోని కూర గ్రామంలో ఆదివారం బీజేపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను కిసాన్ మోర్చా అధ్యక్షులు ఏనుగు రాకేష్‌రెడ్డి ఎగుర వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రజల పార్టీ అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో సిడం రాకేష్, బోగి ఉశన్న, గంగం దత్తు, పబ్బు స్వామి, రాగి మొహన్, రవి ప్రశాంత్, దినేష్, నవీన్, శ్రీకాంత్, ఆకాష్‌లు పాల్గొన్నారు.

ఎంప్లాయిస్ కాలనీలో రామాలయానికి భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలో నూతనంగా రామ మందిరం నిర్మాణం చేపట్టనున్నారు. కాగా ఆదివారం శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని, ఆలయ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. దీనికి సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి, దశరథ్ పటేల్, రామ్ మందిరం అధ్యక్షులు నందాకుమార్, ప్రధాన కార్యదర్శి రాథోడ్ బాబులాల్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి, భూమి పూజ చేశారు. అనంతరం కాషాయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు ప్రమోద్ కుమార్ ఖత్రి మాట్లాడుతూ ప్రతి కాలనీలో రామ మందిరం నిర్మాణం చేయాలని ప్రమోద్ ఖత్రి పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని ప్రభావితం చేయాలని అన్నారు. కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి కార్యనిర్వాహక కార్యదర్శి కందుల రవీందర్, శర్మజీ, షిండే కాలనీవాసులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

శ్రీ రామ నవమి సందర్భంగా ఆదివారం నిర్మల్ పట్టణంలో నిర్వహించిన శ్రీరామ వీరహనుమాన్ భారీ శోభాయాత్రను పురస్కరించుకొని సంకల్ప్ సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు, మినరల్ వాటర్ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ముడారపు కాశి, ప్రధానకార్యదర్శి కుంట సాయికుమార్, దుబ్బ ప్రవీణ్, సాయి చరణ్, సాయినాథ్, సంతోష్ అలాగే కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | ఏప్రిల్ 07, 2025 | www.navatelangana.com

జై బాపు జైభీం జై సంవిధాన్ పాదయాత్ర

నవతెలంగాణ-వాంకిడి



మండలంలోని పాటగూడ, సడక్‌గూడ, చొప్పన్‌గూడ, పిప్పర్‌గొంది గ్రామాల్లో ఆదివారం జై బాపు, జైభీం జై సంవిధాన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గుర్నులే నారాయణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర పన్నుతుందన్నారు. నిండు సభలో కేంద్రమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ను అవహేళన చేశారన్నారు. బలహీన వర్గాల ప్రజలకు న్యాయం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మండోకార్ అనిల్, ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు జబోరే గణేష్, సీనియర్ నాయకుడు మల్లయ్య, సెల్వట్ కార్ పెంటు, చొప్పన్‌గూడ మాజీ సర్పంచ్ సిడాం అన్నిగ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండేవిఠల్, సిర్పూర్ శాసనసభ్యులు హరీష్ బాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్ముని అడుగుజాడల్లో నడిచి, ప్రజలందరూ వారి ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. హింసాకు దూరంగా ఉండూ శాంతియుత జీవనం సాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య జిల్లా సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సోలార్ కరెంటు తీగ తాకి రైతు మృతి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సోలార్ కరెంటు తీగ తాకి రైతు మృతి చెందిన సంఘటన ఆసిఫాబాద్ మండలంలోని ఇప్పల్ నవేగంలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నికోరే బాపూజీ(38) తన అన్నకు చెందిన ఎడ్లు ఇంటికి రాకపోవడంతో వాటిని వెతకడానికి శనివారం రాత్రి పొలాల వైపు వెళ్లాడు. అక్కడ రాథోడ్ వివేక్ కుమార్ చేను వద్ద ఏర్పాటు చేసిన సోలార్ కరెంట్ తీగ తాకడంతో కుప్పకూలి మరణించాడు. ఆదివారం ఉదయం వరకు కూడా బాపూజీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకుతున్న క్రమంలో చేను వద్ద విగతజీవిగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో జరిగిన సీతారామ కళ్యాణోత్సవ కార్యక్రమంలో వచ్చిన భక్తులకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్ రూపనార్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. సీఐ బుద్దే రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరై మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ రైతు అధ్యక్షుడు వైరగడే మారుతి పటేల్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడ ప్రణయ్ కుమార్, ఆసిఫాబాద్ డివిజన్ యువజన అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, కాంగ్రెస్ మైనార్టీ మండల అధ్యక్షుడు షేక్ అసద్, మాలీ మహా సంఘ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు నాగోశే శంకర్, బీసీ సంఘ నాయకుడు సిరికొండ కృష్ణ, షిండే నాందేవ్ పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో

శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని జనకాపూర్‌లోని శ్రీ కోదండ రామాలయర్‌లో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు చల్లని తాగునీరు పంపిణీ చేశారు. ఎండల తీవ్రత నేపథ్యంలో నీటి వసతి కల్పించామని సంఘం నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అనుమాండ్ల శ్రీకాంత్, అల్లె శ్రీకాంత్, మహిళా అధ్యక్ష, కార్యదర్శులు జంజిరాల పుష్పలత, చెన్నూరి సునీత, పట్టణ గౌరవ అధ్యక్షులు కోమటిపల్లి లింగయ్య, కోశాధికారి జంజిరాల సంజీవ్, బొద్దున చందు, పొన్న రామ్ చందర్, చెన్నూరి ప్రకాష్, వనమాల ధర్మయ్య, గుజ్జ మోహన్, ఆవిడపు ప్రణయ్, గుజ్జ రేవతి, రాంపెల్లి విజయ, వనమాల జయ, అనుమాండ్ల సుజాత, పొన్న జ్యోతి, అనుమాండ్ల లహరి పాల్గొన్నారు.



ఇప్పపువ్వు గిరిజనుల కల్పతరువు

- పోషకాలు పుష్కలం.. జాతీయ స్థాయిలో గుర్తింపు..
- వైద్యశాస్త్రంలోనూ ప్రాధాన్యత.. అయినా ఆదరణ కరువు..
- ప్రధాని మోడీ మెచ్చిన లడ్డూకు కొరవడిన గిట్టుబాటు ధర



ఇప్పపువ్వు సేకరిస్తున్న ఆదివాసీ మహిళలు

నవతెలంగాణ-కెరమెరి

ఆదిలాబాద్ అంటేనే ఆదివాసుల జిల్లా... ఇక్కడి ఆదివాసులు ఇప్పపువ్వుతో లడ్డూలు తయారు చేస్తారు. స్థానికంగా సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రతినెలా ఇప్పపువ్వు లడ్డూలు తయారు చేస్తారు. ఉట్నూర్ ఐటీడీఏ అధికారులు ప్రోత్సహించిన తీరు సత్ఫలితాలివ్వగా భారత ప్రధాని మోదీ 125వ మన్‌కీ బాత్‌లో ఇప్పపువ్వు లడ్డూ చర్చకు వచ్చింది. దీంతో స్థానిక గిరిజన మహిళలను మెచ్చుకున్నారు. ఇక్కడి ఇప్పపువ్వు లడ్డూ సైతం జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అలాంటి లడ్డూ తయారు చేసే ఇప్పపువ్వుకు గిట్టుబాటు ధర లేక సేకరణ తగ్గుముఖం పడుతోంది.



అటవీ ఉత్పత్తులే జీవనాధారం..

ఉమ్మడి జిల్లాలోని గిరి పుత్రులకు అడవిలో లభించే ఉత్పత్తులే జీవనాధారం. అందులోనూ కాలానుగుణంగా లభించే ఈఇప్పపువ్వు అతి ప్రధానమైనది. వేసవిలో మాత్రమే దొరికే వీటిని విక్రయించి గిరిజనులు ఉపాధి పొందుతారు. తెల్లవారుజామున అడవిలోకి వెళ్లి ఇప్పుడు గిరిజనులు సేకరిస్తారు. చెట్లపై నుంచి కిందపడిన ఇప్పపువ్వును మధ్యాహ్నానికి సేకరించి ఇంటికి తెచ్చి ఎండబెడతారు. ఇలా ఎండబెట్టిన ఈ పప్పును ఆహార పదార్థాల్లోని రకరకాల వస్తువులను తయారు చేసి ఆహార పదార్థాలుగా వినియోగిస్తారు. ఆరబెట్టిన ఇప్ప పువ్వులను విక్రయిస్తుంటారు.

మూడు నెలల పాటు ఉపాధి

ఉమ్మడి జిల్లాలోని కెరామెరి. జైనూర్, లింగాపూర్, నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి జన్నారం ఖానాపూర్, బోథ్, వాంకిడి, తిర్యాణి, సిర్పూర్ యు, సిర్పూర్ టి, బెజ్జూర్,ఇచ్చోడ బజార్హత్నూర్, ముత్నూర్, కడెం, కౌటా ల, దహెగాం, చింతల మానేపల్లి, మండలాల్లో నివసిస్తున్న గిరిజనులకు మూడు నెలల పాటు ఉపాధి దొరుకుతుంది. ఖరీఫ్ రబి పనులు ముగిసే సమయానికి ఇప్ప విరగబోస్తాయి. విడి పువ్వులు గాలికి నేల రాలుతుంటాయి. ఈ పువ్వులను గిరిజనులు సేకరిస్తారు. వీడితోపాటు మర్రి పనులు స్వీకరించి ఇంటికి తీసుకువస్తారు. వీటన్నింటినీ సేకరించి మారు ఏప్రిల్, మే నెలల్లో విక్రయించి ఉపాధి పొందుతారు.

ఔషధాల తయారీ

గిరిజనుల సేకరించిన ఇప్పపువ్వును జీసీసీ ద్వారా కనుగోలు చేస్తారు. ఈ పువ్వును ఔషదాల తయారీకి విక్రయిస్తారు. ఈ పువ్వు నుంచి తీసిన తైలాన్ని పక్షపాతం వంటి వ్యాధులకు ఉపయోగిస్తారు. అలాగే దంతాలను శుభ్రం చేసుకోవడంతో పాటు దగ్గుకు దంతాలకు సంబంధించిన వ్యాధులకు ఔషధంగా పనిచేస్తుంది. ప్రధానంగా స్వచ్ఛమైన ఇప్పపూలతో తయారుచేసిన సారాను సేవిస్తే వద్ధాప్య లక్షణాలు త్వరగా రాకుండా ఉంటాయని గిరిజనులు అంటున్నారు. వైద్యశాస్త్రంలోనూ ఈ ఇప్పపువ్వు ప్రాధాన్యత సంపాదించుకుంది. ఆయుర్వేదంలోనూ మధకవృక్షం అని పేరు పొందింది. గిరిజన ప్రాంతాల్లోనే ప్రజలు ఈ ఇప్ప చెట్లను మాతృమూర్తిగా భావిస్తారు.

ఇప్ప పువ్వులో ఎన్నో పోషకాలు

అడవిలో లభించే ఇప్ప పువ్వుల గింజల నుంచి తీసిన నూనెలో ఎన్నో పోషక విలువలు ఉన్నట్లు శాస్త్రీయంగా నిరూపించబడింది. భారత శాస్త్రీయ సాంకేతిక మంత్రిత్వ శాఖ సహాయంతో 1999లో నిర్వహించిన పరిశోధనలో ఎండిన ఇప్పపూల నుంచి పంచదారను తయారుచేసి దీనితో జామ్ కేకులు తయారు చేసే విధానాన్ని కనిపెట్టారు. పప్పు ఎక్కువ కాలం ఇలా ఉండడానికి మధ్య మధ్యలో ఎండిన వేపాకులను వేస్తే ఎక్కువ అవుతారు నిల్వ ఉంటుందని తెలుసుకున్నారు. కొందరు గిరిజనులు ఇప్పపువ్వును ఆహారంగా కూడా తీసుకుంటారు.

ధర లేకసేకరణ పై తగ్గిన ఆసక్తి

ఏజెన్సీ ప్రాంతంతో పాటు ఇతర మైదాన ప్రాంతాల్లోనూ వేల చెట్లు ఉన్నప్పటికీ గిరిజన సేకరించిన ఇప్ప పువ్వులను జీసీసి అధికారులు బయట నుంచి అనేక మంది వ్యాపారులు కూడా కానుగోలు చేసి తీసుకుంటూ ఉంటారు. ప్రస్తుతం ఏజెన్సీ ప్రాంతాల్లోని కెరమెరి నార్నూర్, జైనూర్, ఇంద్రవెల్లి, ఉట్నూరు, కడెం, తిర్యాణి, మండలాల్లో అత్యధికంగా గిరిజనులు ఈ పప్పులను సేకరించి జీవన ఉపాధి పొందుతున్నారు. అయితే సరైన ధర లభించకపోవడంతో కాలక్రమేపి గిరిజనులు కూడా ఆసక్తి చూపడం లేదు. అలాగే పలు చోట్ల అటవీ ఉత్పత్తుల చెట్లను కూడా నరికి వేస్తున్నట్లు సమాచారం.

అటవీ ఉత్పత్తులకు కొనుగోలు ప్రారంభించాం



తారాచంద్, జీసీసీ మేనేజర్, కుమురంభీ-ఆసిఫాబాద్

ఏటా ఏప్రిల్ ఒకటి నుండి ఇప్ప పువ్వులు, తేనె ఇతర అటవీ ఉత్పత్తుల కొనుగోలకుజిల్లాలోని 25 డీఆర్‌డిపో కేంద్రాల్లో కొనుగోలు చేయడం జరుగుతుంది. ఇప్పటికే డీఆర్‌డిపో పరిధిలోని గ్రామాల్లో ప్రచారాన్ని చేపట్టాం. ఆసిఫాబాద్ డివిజన్లో 500 క్వింటాళ్ల ఇప్పపువ్వు, 500 కింటాళ్ల తేనె, కాగజ్‌నగర్‌లో 700 క్వింటాళ్ల ఇప్పపువ్వు, 400తేనే కొనుగోలుకు చర్యలు చేపడుతున్నాం. ఈ ఏడాది ఇప్పపువ్వు కిలో రూ.30 ధరను ప్రకటించాం.

గిట్టు బాటు ధర కల్పించాలి

కోవ ఇందిరా, ఆదివాసీ మహిళ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి



మూడు నెలల పాటు మారు మూల గ్రామాల్లోని ఆదివాసులు ఎక్కువగా అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవనం కొనసాగించ జరుగుతుంది, ఇపప్పూలకు, జీడీ గింజలకు ఏళ్లుగా గిట్టుబాటు ధర లభించడం లేదు. దీంతో గతంలో లాగ ఇప్ప పువ్వు సేకరణకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. ప్రతి ఏటా పువ్వు సేకరించే వారి సంఖ్య తగ్గుతుంది.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. మొదటగా పార్టీ జిల్లా అధ్యక్షులు శ్రీశైలం, సీనియర్ నాయకులు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వరావుతో కలసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. రానున్న కాలంలో తెలంగాణలో తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో శ్రేణులు ముందుకు సాగాలని, రానున్న ప్రతి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం చేయాలన్నారు. ఈ నెల 6 నుండి 12 వరకు నిర్వహించే వేడుకల్లో క్షేత్రస్థాయి వరకు ప్రతి కార్యకర్త పాల్గొనాలని సూచించారు. అనంతరం పార్టీ శ్రేణులు స్వీట్స్ తినిపించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, పార్టీ మండల అధ్యక్షులు సుంకరి పెంటయ్య, నాయకులు మాటురీ జయరాజ్, ప్రసాద్ గౌడ్, దీపక్ రావ్, సత్యనారాయణ పాల్గొన్నారు.



పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న బీజేపీ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-కెరమెరి

నేడు 33 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా మూడు గంటల పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రామనవితో పాటు స్పెషల్ పబ్లిక్ ప్రసిక్యూటర్ సంజయ్‌కుమార్ వైరగారే జ్ఞాపకార్థం పేదలకు దుప్పట్లనుపంపిణీ చేశారు. జనకాపూర్ రామాలయ ప్రాంగణంలో బీజేపీ నాయకుడు కంద్రె విశాల్, రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ఆసిఫాబాద్ కండ వ్యవస్థ ప్రముఖ కొలిపాక వేణుగోపాల్, న్యాయవాదులు రాజ్ కుమార్, ఝాన్సీ పేద ప్రజలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాల్, బోనగిరి బాబు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణ వేడుకలు

- ఆద్యంతం అలరించిన శోభాయాత్ర
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు
- పాల్గొన్న ప్రముఖులు..పటిష్ట బందోబస్తు



ఆసిఫాబాద్ : పట్టువస్త్రాలతో వస్తున్న ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని జనకపూర్ రామాలయంలో సీతారాముల కళ్యాణం కనుల పండుగగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని రకాల ఏర్పాట్లు చేయగా ఉదయం నుండి పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి నిమ్మకంటి సంతోష్ శర్మ ఆధ్వర్యంలో శ్రీరాముని కళ్యాణ వేడుకలు అంబరాన్నంటేలా సాగాయి. వేద పండితులు శిరీష్ శర్మ, రాజశేఖర్ శర్మ, పూర్ణచందర్, అభయ్ ఆచార్య, నరేష్ శర్మ, విజయ్ కుమార్, ఆనంద్, ఆచార్య తిరుపతితో పాటు 12 మంది వేదపండితులు పూజాది కార్యక్రమంలో పాల్గొని క్రతువు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, కమిటీ సభ్యులు సిరిపురం భద్రయ్య, శైలేందర్, పత్రె గిరి, శివచందు, సిహెచ్.రవి, చిప్ప మహేష్, జగన్, ఇప్ప నాగరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అలరించిన శోభాయాత్ర

శ్రీరామ నవమి వేడుకల సందర్భంగా ఉత్సవ విగ్రహాలను జిల్లా కేంద్రంలో చేపట్టిన శోభాయాత్ర అద్యంతం అలరించింది. భాజాభజంత్రీల మధ్య డీజే సౌండ్‌తో దాదాపు 400 మందితో శోభాయాత్ర సాగింది.

పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే

వేడుకల్లో భాగంగా శ్రీరాముని కళ్యాణానికి ఎమ్మెల్యే కోవలక్ష్మీ, సోనేరావు దంపతులు తన కుమారుడు సాయితో కలిసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సుఖశాంతులతో ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. ప్రతి సంవత్సరం ఆనవాయితీగా పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నట్లు వివరించారు.

పాల్గొన్న ప్రముఖులు

రామాలయం ఆవరణలో నిర్వహించిన శ్రీరాముని కళ్యాణ వేడుకలకు ఎమ్మెల్యే కోవలక్ష్మితో పాటు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జడ్పిటిసి నాగేశ్వరరావు, సినీ నిర్మాత దండ నాయకుల సురేష్ కుమార్, మాజీ ఎంపీపీలు మల్లికార్జున్, బాలేష్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చిలువేరు వెంకన్న, గాధవేని మల్లేష్ పాల్గొన్నారు.

పోలీసుల పటిష్ట బందోబస్తు

శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఎస్‌డీపీఓ, ఎఎస్పీ చిత్తరంజన్ నేతృత్వంలో బందోబస్తు నిర్వహించారు. పట్టణ సీఐ రవీందర్, ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్, ఎస్సై ప్రశాంత్‌ల ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆసిఫాబాద్ : కళ్యాణంలో తాళి చూపిస్తున్న వేదపండితులు

బెజ్జూర్ : మండలంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం సీతారాముల విగ్రహాలతో శోభాయాత్ర చేపట్టిన అనంతరం మధ్యాహ్నం 12:30కు కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. ఈ కళ్యాణాన్ని వీక్షించడానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. బెజ్జూర్ రంగనాయక ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్సీ దండే విఠల్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు జగ్గా గౌడ్ శ్రీ వర్ధన్, మిరియాల పెంటయ్య, సామల రాజన్న, రంగు సురేష్ గౌడ్, సతీష్, మహేష్, తిరుపతి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని కోదండ రామాలయం, చెడువాయి, కమ్మర్గాం, మురళిగూడ, అగర్ గూడ, కొండపల్లి, లోడుపల్లి గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని కనుల పండుగ జరిపారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.

దహెగాం : మండలంలోని గ్రామగ్రామాన ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నులపండుగగా సాగింది. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం కళ్యాణ మహోత్సవ క్రతువు నిర్వహించారు. మండలకేంద్రంలో జరిగిన కళ్యాణ మహోత్సవంలో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు.



దహెగాం : సీతారాములకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

వాంకిడి : మండలంలోని బంబారా గ్రామ సమీపం వద్ద ఆదివారం శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. పూజారులు మనోజ్, శేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించి కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అజయ్‌కుమార్, సర్పంచ్ తుకారాం, కమిటీ నిర్వాహకుడు వెంకట్‌రావ్, వ్యాపారస్తులు రవి, అవినాష్, ప్రజా ప్రతినిధులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బెజ్జూర్ : కళ్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్



వాంకిడి : సీతారాముల కళ్యాణాన్ని జరిపిస్తున్న వేద పండితులు

మూడు ముక్కలాడుతూ పట్టు పడిన యువకులు

నవతెలంగాణ-మంచిర్యాల



మూడు ముక్కలట ఆడుతున్న 7 గురిని ఆదివారం అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు మంచిర్యాల పట్టణ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నమ్మ దగిన సమాచారం మేరకు జిల్లా కేంద్రంలోని తిలక్ నగర్ పరిసర ప్రాంతంలో సిబ్బందితో కలిసి గస్తి నిర్వహించగా మూడు ముక్కలట ఆడుతున్న 7 గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టు బడిన వారిలో గోదార్ల రమేష్, దేవసాని కుమార్, ఆటకారి శ్రీను, వనం లక్ష్మణ్, మాచర్ల వెంకటేష్, తోకల శ్రీనివాస్, గౌరీ ప్రసాద్‌లు ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రు 2100, 4 సెల్ ఫోన్‌లు, 2 మోటార్ సైకిల్స్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

సొంత ఖర్చుతో రోడ్డు మరమ్మతులు

నవతెలంగాణ-నస్పూర్



శ్రీరాంపూర్ ఏరియాలోని నేషనల్ హైవే నుంచి ప్రగతి స్టేడియం వరకు రహదారిపై గుంతలు పడి అధ్వాన్నంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు గుంతల మయమై గోదావరిఖని వైపు, బెల్లంపల్లి, వర్క్‌షాప్ వెళ్ళే కార్మికులు కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో వాహనదారులకు యాక్సిడెంట్ అయి చాలా ప్రమాదాలకు గురయ్యారు. విషయం స్థానిక మాజీ ప్రజా ప్రతినిధి మాజీ ఎంపీటీసీ ఏల్పుల మమత-రవీందర్ దృష్టికి రాగ రూ.45 వేలు ఖర్చు చేసి మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా 6వ వార్డు కాంగ్రెస్ ఇన్‌చార్జి చిలుక మల్లేష్, కాంగ్రెస్ సినియర్ నాయకులు పోట్ల చర్ల రాములు, కాంగ్రెస్ నాయకులు శనిగారం భూమయ్య, కాదాసి రాజయ్య, గండు మల్లయ్య, కళ్లపల్లి స్వామి, మొండి, బక్కదట్ల ఓదెలు, రామగిరి మల్లన్న అభినందించారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో మేడే పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీరాంపూర్ డివిజన్‌లోని అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే పర్వదినాన్ని పురస్కరించుకొని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పి.నర్సయ్య స్మారకార్థం క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని అన్ని గనులు డిపార్ట్మెంట్లలో దాదాపు 40 శాతం మంది యువ కార్మికులు ఉన్నారని, ఈ పోటీల ద్వారా వారి ప్రతిభను కనబరిచి భవిష్యత్తులో సింగరేణి యాజమాన్యం నిర్వహించే పోటీలకు ఎంపిక అయ్యే అవకాశం ఉందని అన్నారు. ఈ పోటీల ద్వారా అన్ని గనుల కార్మికులతో సన్నిహిత్యం పెరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని శ్రీరాంపూర్ డివిజన్‌లోని యువ కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోటీలలో భాగంగా ఆదివారం ఆర్కె-5 గని కార్మికులతో మ్యాచ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సకినల నర్సయ్య, ఫిట్ కార్యదర్శి గునిగంటి నర్సింగ్ రావు, ట్రేడ్స్ మేన్స్ ఉపాధ్యక్షుడు సురేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, సోషల్ మీడియా ఇన్‌చార్జి రాజ్ కుమార్, నాయకుల అగ్గు శ్రీకాంత్, శ్రీనివాస్, జీపీ రావు, సందీప్ పాల్గొన్నారు.

ఆకతాయిల ఆట కట్టించిన షీ టీమ్ సిబ్బంది



నవతెలంగాణ-మంచిర్యాల

ఇష్టానుసారంగా రోడ్లపై తిరుగుతూ మహిళలు, అమ్మాయిలను ఇబ్బందులకు గురి చేసే వారి పై కఠిన చర్యలు తీసుకో బడుతాయని మంచిర్యాల షీ టీమ్ ఎస్ఐ హేమ అన్నారు. ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా దేవాలయలు, కల్యాణనికి వెళ్లే మహిళలుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిల్లాలో షీ టీమ్ సిబ్బందితో ప్రత్యేక గస్తి ఏర్పాటు చేశారు. పట్టణంలోని గోదావరి రోడ్, రాంనగర్, గౌతమి నగర్‌లలో నిర్వహించే సీత రాముల కల్యాణ వేడుకలకు హాజరయ్యే మహిళలు, అమ్మాయిల చుట్టు తిరుగుతూ ఇబ్బందులకు గురి చేసిన పలువురు యువకులను అదుపులోకి తీసుకొని కౌన్సిలింగ్ నిర్వహించి నట్లు తెలిపారు. ఎవరైనా మహిళలు వేధింపులకు గురి అవుతున్న, ఏదైనా ఇబ్బందులు కలిగిన డయల్ 100, షీ టీమ్ నెంబర్ 6303923700కు సమాచారం అందించాలని కోరారు.

ప్రజా ఉద్యమంతోనే బుద్ధి చెప్పాలి

- నాయిని కన్నయ్య కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ(ఎం) బృందం

నవతెలంగాణ-జైపూర్

పెత్తందార్ల అరాచకాలకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు బుద్ధి చెప్పాలంటే ప్రజా ఉద్యమాలతోనే సాధ్యమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. వేమనపల్లి మండలం మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య కుటుంబాన్ని ఆదివారం సీపీఐ(ఎం) బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా సంకెరవి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మృతి చెందిన ఆదివాసి బిడ్డ పెత్తందార్ల దుర్మార్గానికి పురుగుల మందు తాగి బలవన్మరణం పొందాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు పెత్తందార్ల ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. గుడుంబా అమ్మేది బెల్టు షాపులు నిర్వహించేది పెత్తందారులే. వారి దుర్మార్గాలకు ఆదివాసి, దళితులు బలైపోతున్నారని, గొడ్డు చాకిరి చేయించుకోవడమే కాకుండా మానసిక హింసలు, వేధింపులు ఆదివాసి, దళితులు ఆత్మహత్యలకు కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకున్న ఆదివాసి బిడ్డ నాయిని కన్నయ్య కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం ఇవ్వడమే కాకుండా కన్నయ్య మృతికి కారకులైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మంగెనపల్లికి చెందిన



మంగెనపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) నాయకుల బృందం

ఎనగంటి చిన్నన్నకు పాలేరుగా పని చేస్తున్న నాయిని కన్నయ్యపై అగ్రవర్ణపు అహంకారం కన్నయ్య ఆత్మహత్యకు కారణం అయిందని అన్నారు. మృతునికి భార్య స్వరూప, 9 సంవత్సరాల కుమారుడు ఉన్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వ అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలని ఇక్కడ ఆదివాసి దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని క్షేత్ర స్థాయిలో గుర్తించి బాధ్యులైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోడంకి చందు, సామల ఉమారాణి, జిల్లా కమిటి సభ్యులు మడిమాడుగల బ్రహ్మయ్య, ఏఐఏడబ్ల్యూయూ జిల్లా అధ్యక్షుడు ఎర్మా పున్నం పాల్గొన్నారు.

ఘనంగా బీటీ రణదీవే 35వ వర్థంతి



జన్నారంలో..

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సీఐటీయూ వ్యవస్థాపకులు బీటీ రణదివే 35వ వర్ధంతిని సీఐటీయూ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు కూకటికారి బుచ్చయ్య, మండల నాయకులు అంబటి లక్ష్మణ్ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15 తర్వాత దేశానికి స్వాతంత్రం లభించిన తర్వాత దేశంలో అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయన్నారు. అంతవరకు ఒకటిగా ఉన్నా భారత కమ్యూనిస్టు పార్టీలో సంస్కరణ వాద పోకడల వల్ల సిద్ధాంత విభేదాలు తీవ్రమవడంతో 1964లో కొంతమంది నాయకులతొ బీటీ రణదివే బయటకు వచ్చి భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)ను ఏర్పాటు చేశారన్నారు. పార్టీ చీలినప్పటికీ ట్రేడ్ యూనియన్ ఐక్యతగా ఉండాలని రణదీవే ఏఐటీయూసీతో పని చేయాలని భావించారు. ఏఐటీయూసీ అసమ్మతి వాదులతో కలిసి పనిచేయటం ఎక్కువ కాలం కుదరలేదు. దీనితో ఏఐటీయూసీలో చీలిక అనివార్యమయ్యింది. 1970 మే 28 నుండి 31 తేదీలలో కలకత్తాలో జాతీయ మహాసభలో కార్మిక వర్గ విశాల ప్రయోజనాల కోసం ఒక సీఐటీయూను ఏర్పాటు చేశారన్నారు.. మొదటి మహాసభలో 5000 మంది ప్రతినిధులు హాజరైనారన్నారు. దీనికి సీఐటీయూ మొట్టమొదటి అధ్యక్షుడిగా రణదీవేని ఏకగ్రీవంగా ఎన్నుకోన్నుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కనికరపు అశోక్, సీఐటీయూ నాయకులు లక్ష్మణ్, మండల కన్వీనర్, దాసండ్ల రాజన్న, అంబటి సువర్ణ, శ్రీనిధి పాల్గొన్నారు.

లక్షెట్టిపేట : మండల కేంద్రంలోని స్థానిక విశ్రాంతి భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం కార్మిక ఉద్యమ నాయకులు సీఐటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే 35వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ పాల్గొని రణదివే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సాగర్, రవి రాజన్న విలాస్ రాయలింగు తదితరులు కార్మికులు పాల్గొన్నారు.



లక్షెట్టిపేటలో..

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట గ్రామానికి చెందిన దుర్గం రమ్య(27) ఆత్మహత్య చేసుకుందని కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రమ్యకు 2016లో కాసిపేటకు చెందిన దుర్గం రాయమల్లుతో వివాహం జరిగింది. కొద్ది రోజుల క్రితం దుర్గం రాజమల్లుకు పక్షవాతం రాగా మృతురాలు దుర్గం రమ్య కూలీ పని చేయగా వచ్చిన డబ్బుతో పాటు కొంత అప్పుచేసి అతనికి చికిత్స చేయించింది. ఇదే విషయమై చాలా సార్లు మృతురాలు తన తండ్రి కుమ్మరి రాజన్నకు చెప్పుకొని బాధపడుతుండేది అతను చాలా సార్లు కూతరుకు ధైర్యం చెప్పేవాడు. తర్వాత తన భర్త అనారోగ్యంతో పాటు అప్పుల బాధను భరించలేక జీవితం మీద విరక్తి చెంది దుర్గం రమ్య ఆదివారం ఉదయం కాసిపేటలోని తన ఇంట్లో పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటుండగా, కుటుంబ సభ్యులు చూసి వెంటనే అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మృతురాలి తండ్రి కుమ్మరి రాజన్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఉపరితల గని కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ అన్నారు. ఆదివారం ఇందారం ఉపరితల గనిలో పనిచేస్తున్న ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని కాంట్రాక్టు కార్మికులను కలిసి మద్దతు తెలిపారు. కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఇందారం ఉపరితల గనిలో పనిచేస్తున్న వాల్వో డ్రైవర్లకు వరాహ కంపెనీ యాజమాన్యం కనీస వేతనాలు చెల్లించడం లేదని మండిపడ్డారు. 18 నెలలుగా జీతాలు పెంచకుండా వెట్టి చాకిరి చేయించుకున్నారని ఆరోపించారు. వెంటనే సింగరేణి యాజమాన్యం స్పందించి తప్పని పరిస్థితులలో సమ్మె చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-మంచిర్యాల

ఇందరంలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో చదువుకున్న 2005 పదవ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. దాదాపు 20 సంవత్సరాల అనంతరం ఒకే వేదికపై ఆనాటి విద్యార్థులు అంత కలవడంతో వారి ఆనందనికి అవధులు లేకుండా పోయింది. అప్పటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ సంతోషంగా గడిపారు. వారికి విద్య బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. సందర్భంగా ఫోటోలు దిగుతూ సందడి చేశారు.

అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం



జైపూర్ ఎస్టీపీపీలో సీతారాములను దర్శించుకున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

నవతెలంగాణ-జైపూర్

శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భీమారం గ్రామంలోని కోదండ రామాలయంలో ఆదివారం 12:15 గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు భక్తుల సమక్షంలో ఆలయ కమిటి ఆధ్వర్యంలో వేదపండితులైన విశ్వేశర శర్మ, తిరునగరి ప్రవీణ్‌లు కల్యాణం చేశారు. చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి కల్యానోత్సవానికి హాజరై దేవతామూర్తులను దర్శించుకున్నారు. అదేవిదంగా జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆవరణలో గల రామాలయంలో హాజరైన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి ప్లాంట్ ఈడీ చెన్నకేశవుల చిరంజీవి, జనరల్ మేనేజర్ శ్రీనివాసులు ఇతర అధికారుల ఆధ్వర్యంలో పూర్ణకుంబంతో స్వాగతం పలికారు. స్థానిక కాంగ్రెస్ నాయకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిదంగా జైపూర్ మండల కేంద్రంతో పాటు చెన్నూర్ మండలం సుద్దాల, కోటపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జన్నారం : మండలంలోని తిమ్మాపూర్ గ్రామ పవిత్ర గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారులు వేద పండితులు రాములోరి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అలాగే మండల కేంద్రంలోని, రామాలయంలో, మందపల్లి గ్రామంలో ఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో, జన్నారం పట్టణంలోని, హనుమాన్ ఆలయంలో ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాల్లో ఉచిత అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్, అదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు ఆత్రం సుగుణ, తిమ్మాపూర్ జన్నారం రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. జన్నారం రామాలయ కమిటీ చైర్మన్ మిక్కిలినేని రాజశేఖర్, తిమ్మాపూర్ గ్రామ రామాలయ కమిటీ సభ్యులు కమల భూమయ్య, గంగయ్య, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, శ్రీరామ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



మంచిర్యాలలో..



మంచిర్యాల : జిల్లా కేంద్రంలోని ఆలయాలు రామ నామ స్మరణతో మారు మొగాయి. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పలు గ్రామాలల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. గౌతమి నగర్‌లోని శ్రీకోదండ రామాలయంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. పాత మంచిర్యాలలోని రామాలయం శివాలయంలో నిర్వహించిన సీతరాముల కల్యాణనికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కుటుంబ సభ్యులతో హాజరై పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ సిబ్బంది. అనంతరం అన్నదానం నిర్వహించారు. హనుమాన్ భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దండేపల్లి : శ్రీరామనవమి వేడుకలు ఆదివారం మండలంలోని అన్ని గ్రామాలలో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారాముల కల్యాన్నాన్ని తిలకించారు. ఆయా గ్రామాలలోని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వెలగనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు ప్రారంభించారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో పాల్గొని ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు కమిటీ సభ్యులు అందజేశారు.



నస్పూర్‌లో..

లక్షెట్టిపేట : పట్టణంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయా ప్రాంగణంలో కల్యాణమండపంలో ఉదయం 10.30 గంటలకు తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం అభిజిత్ లగ్నం కల్యాణం అనంతరం అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు నల్మస్ కాంతయ్య, మైలారపు సుధాకర్, సుదర్శన్, తాటికొండ శ్రీనివాస్, చింత అశోక్ కుమార్, యేనగందుల సుధాకర్, పలేర్ల శ్రీనివాస్, పాలకుర్తి లచ్చన్న, రామన్న, మల్యారి శ్యామ్ సుంధర్, అనిల్ గుండా సంతోష్ పాల్గొన్నారు.

నస్పూర్ : శ్రీరాంపూర్, నస్పూర్ ఏరియాలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. నస్పూర్ కాలనీలోని వెంకటేశ్వర ఆలయంలో డైరెక్టర్(ఆపరేషన్) దంపతులు సూర్యనారాయణ-మాలతి, శ్రీరాంపూర్ ఏరియా జీఎం దంపతులు ఎం శ్రీనివాస్-ఉమారాణి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పట్టు వస్త్రాలను అందజేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయ పూజారులు కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. ఈ కళ్యాణానికి కార్మికులు వారి కుటుంబ సభ్యులు పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం సత్యనారాయణ, అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు కేవీ రెడ్డి దంపతులు, ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు టి శ్రీనివాస్ దంపతులు, ఏవీ రెడ్డి దంపతులు, ఏజీఎం ఫైనాన్స్ బీభత్సా దంపతులు, ఎస్టీపీపీ ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్ దంపతులు, డీజీఎం ఐఈడీ కె చిరంజీవులు దంపతులు, ఏరియా స్టోర్స్ మల్లయ్య దంపతులు పాల్గొన్నారు.

హైకోర్టు మాజీ న్యాయమూర్తిని కలిసిన అత్రం సుగుణ



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఆదివారం తెలంగాణ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ గుండా చంద్రయ్యను కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటు ఇన్‌చార్జి అత్రం సుగుణ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రయ్య మాట్లాడుతూ రాజకీయ నాయకులు పేద ప్రజలకు సేవ చేసి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలవాలన్నారు. రాజకీయ నాయకులకు రాజకీయానికి నీటికి చేపక్కున్న సంబంధం ఉంటుందన్నారు. చేప నీటిలో ఉండి జీవిస్తుంది రాజకీయ నాయకులు ప్రజల్లో ఉండి జీవిస్తారన్నారు. కానీ అన్నిటికంటే ముఖ్యమైనది చదువు అన్నారు. ప్రతి ఒక్కరు చదివితేనే ఆ చదువు మనల్ని ఒక దారిలో పెడుతుంది అన్నారు. తమ తమ పిల్లలను ఉన్నత స్థాయిలలో చదివించి, సమాజంలో మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మల్లేష్, తిమ్మాపూర్ మాజీ ఎంపీటీసీ వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ చంద్రయ్య జాడి వెంకటయ్య, మార్నేని రెడ్డి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఏప్రిల్ 07, 2025 | www.navatelangana.com

అక్రమ మద్యం పట్టివేత

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్



నిర్మల్ రూరల్ మండలం న్యూ పోచంపాడ్ గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా పెద్ద మొత్తంలో మద్యం నిల్వ ఉందని సమాచారంతో ఆదివారం ఏఎస్పీ రాజేష్ మీనన్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అక్రమంగా మద్యం అమ్ముతున్న సంపంగి శివాయి బెల్ట్ షాపు తనిఖీ చేసి షాపు నుంచి 45.6 లీటర్ల రూ.25,850 విలువ గల మద్యం స్వాదీనం చేసుకొని, అట్టి వ్యక్తిని, మద్యం బాటిల్స్‌ను నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు.

సీపీఐ(ఎం) జాతీయ మహాసభలో జిల్లా నాయకులు

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో జరుగుతున్న 24వ భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభల్లో నిర్మల్ జిల్లా నుంచి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, డాకూరు తిరుపతి, గైని మురళీమోహన్ తిమ్మాపురం ముత్తన్న, గడ్డం రాజేష్ పాల్గొన్నారు.



కాల్చివేత.. కూల్చివేత

- మర్రి వృక్షాలకు మనుగడ కరువు
- కనుమరుగైపోతున్న మర్రి వృక్షాలు
- వేల నుంచి వందల సంఖ్యలో
- నిలువ నీడ కరువు

నవతెలంగాణ-లింగంపేట్

అశోక చక్రవర్తి నిజాంపాలనలో నాటిన మర్రి వృక్షాలు మనుగడ ప్రస్తుతం కరువైపోతుంది. రోజురోజుకు మర్రి వృక్షాలను కొందరు కావాలని కాలబెడుతూ కూల్చేస్తున్నారు. గతంలో వేల సంఖ్యలో ఉన్న మర్రి వృక్షాలు ప్రస్తుతం వందల సంఖ్యల్లో దర్శనమిస్తున్నాయి. రానున్న రోజుల్లో పర్యావరణానికి ముప్పు ఏర్పడే అవకాశాలున్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మొక్కలు పెంచాలి. పర్యావరణాన్ని కాపాడాలి. చెట్లు పెంచితేనే వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయని ప్రభుత్వం చెబుతున్నా.. కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా.. పూర్వపు కాలంలో నాటి ఎదిగిన మర్రి చెట్లను కాపాడలేకపోతుందని పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అశోక చక్రవర్తి పాలనతో పాటు నిజాంపాలనలో నిజాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం చేపడుతున్నప్పుడు నిజాం నవాబు ప్రధాన రహదారులకు రోడ్డుకు ఇరువైపులా మర్రి వృక్షాలు నాటినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు చేపట్టేటప్పుడు ముడి సరుకులు ప్రాజెక్టు అవసరమైనటువంటి వస్తువులను తీసుకురావడానికి దూర ప్రాంతాల నుండి దిగుమతి చేసుకోవడానికి రోడ్డుకిరువైపులా మర్రి వృక్షాలు నాటినట్లు పూర్వీకులు చెప్తున్నారు. కామారెడ్డి జిల్లాలో గతంలో ప్రధాన రహదారులకు ఇరువైపులా వేల సంఖ్యలో మర్రి వృక్షాలు ఉండేవి. ఎండాకాలంలో వాహనదారులకు, కాలినడకన రాకపోకలు సాగించేవారికి, పర్యాటకులకు, పశువుల కాపరులకు, కూలీలకు ఎండాకాలంలో చల్లటి నీడనిచ్చేవి. దూర ప్రాంతాల నుంచి ప్రయాణం చేసే టూరిస్టులు వాహనదారులు ఎండ తీవ్రతను తట్టుకోలేక మర్రి చెట్ల వద్ద గంటపాటు సేద తీర్చుకునేవారు. ప్రస్తుతం మర్రి చెట్లు లేకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా మైదాన ప్రాంతాలుగా దర్శనమిస్తున్నాయి. గతంలో రోడ్డుకు పచ్చని తోరణంలా అడుగడుగునా మర్రి చెట్లు ప్రజలకు స్వాగతం పలుకుతుండేవి. ప్రస్తుతం అలాంటి చెట్లు కనిపించకుండా పోతున్నాయి.

ఈ ప్రాంతాల్లో అధికం..

జిల్లాలోని కామారెడ్డి నుంచి ఎల్లారెడ్డి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా 45 కిలోమీటర్ల వరకు ఎర్రపాడు, మోతే, గాంధీనగర్, బురిగిద్ద, ముస్తాపూర్, లింగంపల్లి, లింగంపేట్, మెంగారం, లక్ష్మాపూర్, అడవి లింగాల్, మాసనపల్లి, ఎల్లారెడ్డి అంబేద్కర్ చౌరస్తా వరకు రోడ్డు కిరువైపులా, అదేవిధంగా ఎల్లారెడ్డి నుంచి మెదక్ వెళ్లే ప్రధాన రహదారి మెదక్ వరకు నాగిరెడ్డిపేట్, తాండూర్, పెద్దారెడ్డి, ధర్మారెడ్డి, రాఘవపల్లి, మల్లయ్యపల్లి, సాతెల్లి, శివనగర్, ఎల్లారెడ్డిత పెద్ద చెరువు కట్ట పైనుండి ఎల్లారెడ్డి వరకు, అలాగే ఎల్లారెడ్డి నుండి నిజాంసాగర్ వరకు నిజాంసాగర్ నుండి పిట్లం వరకు బొగ్గు గుడిసె నుండి మమ్మద్‌నగర్, బాన్సువాడ వరకు, కామారెడ్డి నుండి సదాశివనగర్, బాన్సువాడ ఎక్స్ రోడ్ నుండి బాన్సువాడ వరకు గాంధారి మీదుగా వేల సంఖ్యలో ఉన్న మర్రి వృక్షాలు వేల సంఖ్యలో నుంచి పదుల సంఖ్యలోకి చేరుకున్నాయి.

నిబంధనలు పాటించని భిక్కనూర్ టోల్‌ప్లాజా సిబ్బంది

- టోల్ వసూలు చేయడమే లక్ష్యం
- లోకల్, నాన్‌లోకల్‌తో సంబంధం లేని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న భిక్కనూర్ టోల్‌ప్లాజా మేనేజర్‌తో పాటు సిబ్బందికి ఇష్టానుసారంగా ప్రవర్తిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఎవరి వద్ద టోల్ ప్లాజా డబ్బులు వసూలు చేయాలో ఎవరి వద్ద చేయకూడదో తెలియదా లేకపోతే తెలిసే వసూలు చేస్తున్నారన్న అనుమానాలను సైతం స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు స్థానికులు ఈ గ్రామం నుండి ఆ గ్రామానికి ఆ గ్రామంలో నుండి ఈ గ్రామానికి వెళుతూ వస్తుంటారు. వెళ్లిన ప్రతిసారి టోల్ ప్లాజాలో డబ్బులు చెల్లించాలంటే నెలకు సుమారు అయిదారువేల వరకు అవుతుందని పలువురు పేర్కొంటున్నారు. 20 కిలోమీటర్ల వరకు టోల్ ప్లాజాకు డబ్బులు చెల్లించవలసిన అవసరం లేదు. నేషనల్ హైవే అథారిటీ నిబంధనల ప్రకారం 20 కిలోమీటర్ల వరకు ఉన్న స్థానికులు ఎవరైనా సరే టోల్ ప్లాజాలో డబ్బులు కట్టవలసిన అవసరం లేదు. ఐదు కిలోమీటర్ల లోపల ఉన్నవారు సైతం టోల్ ప్లాజాలో డబ్బులు చెల్లించాలని భిక్కనూర్ టోల్‌ప్లాజా సిబ్బంది స్థానికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు జిల్లా విలేకరులు వివిధ వార్తల సేకరణకు జిల్లాలో ప్రతి మండలానికి తిరుగుతుంటారు. అందులో భాగంగా కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి భిక్కనూర్ మండల కేంద్రానికి వెళ్లాలన్నా, ఆ మండలంలోని ఏ గ్రామానికి వెళ్లాలన్న ఈ టోల్‌ప్లాజా దాటి వెళ్లవలసిందే. అయితే టోల్ ప్లాజా సిబ్బంది మాత్రం వెళ్ళిన ప్రతిసారి డబ్బులు చెల్లించాల్సిందేనని ఒత్తిడి తెస్తున్నారని పలువురు జర్నలిస్టులు సైతం పేర్కొంటున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు, జర్నలిస్టులు కోరుతున్నారు.

ప్రారంభించారు.. వదిలేశారు..

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని లాడేగామ్ గ్రామం గత 20 ఏళ్ల క్రితం వేసిన బీటీ రోడ్డు ప్రస్తుతం గుంతలమయంగా మారడంతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారినా తమ గ్రామ రోడ్డు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సరిగా లేక ఈ గ్రామానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు, వద్ధులు, మహిళలు, ఉద్యోగులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హడావిడిగా పనులు ప్రారంభించింది. ఉన్న రోడ్డును నాలుగు కిలోమీటర్ల మేర తవ్వేసి అనంతరం కంకర వేశారు. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయాయి. ఈ ప్రభుత్వమైనా సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కళ్యాపూర్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని బోధన్ రూరల్ సీఐ విజయబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత మత్తు పదార్థాలకు, గంజాయి, తదితర వ్యసనాలకు బానిసలు కావొద్దని, చదువుపై ఆసక్తి కనబరిచి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ సభ్యులు సంతోష్, అఖిల్, రాజ్ కుమార్, మురళి, సంజీవ్, శివ, హరి, గంగోనీ తేజ, అక్షయ్, యోగేష్, అనూష్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

నవతెలంగాణ-కామారెడ్డి

గొల్లవాడకు చెందిన కొట్టూరి లక్ష్మీ స్వరూప (50) అనే మహిళ శనివారం ఉదయం 5 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. భర్త కొట్టురి సంపత్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ 8712686145, 8712666242 నెంబర్లకు తెలియజేయాలని తెలిపారు.

ఘనంగా శ్రీ రామనవమి వేడుకలు



కడెం: కళ్యాణోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని రామాలయంలో, మండలంలోని బెల్లాల్ పెర్కపల్లె గ్రామాలలో శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణము అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కాంగ్రెస్ నాయకులతో కలిసి హాజరై, సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలు చేసిన సీతారాముల పవిత్ర బంధమని ధర్మానికి కట్టుబడి ఉన్న శ్రీరాముడు తరతరాలకు ఆదర్శనీయుడని సీతారాముల కళ్యాణం ఒక మహత్తర ఘట్టమని అన్నారు. రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మెన్ భూమన్న, జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తక్కల సత్యనారాయణ, మాజీ కాంగ్రెస్ మండలాధ్యక్షులు గొల్ల వెంకటేష్, కడెం మాజీ సర్పంచ్ అనూష లక్ష్మణ్, పాలకుర్తి కృష్ణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాంసి : శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం తాంసి, భీంపూర్ మండలాల్లోని శ్రీరాముని ఆలయాలతో పాటు పలు ఆలయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఆలయంలోని వేద పండితులు ఎంతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొన్నారి గ్రామంలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. శ్రీరామ నవమి సందర్భంగా నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. రామ నవమి వేడుకలకు విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను ఆలయ సభ్యులు ఘనంగా సన్మానించారు. ముందుగా గ్రామంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు. అనంతరం హనుమాన్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి, షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అనంతరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ శాంతియుతంగా రామ నవమి జరుపుకోవాలని, ప్రతి ఒక్కరికి సీతారాముల ఆశీస్సులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణ, రఘు, మహేందర్, వినోద్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అశోక్, ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : శ్రీరామ నవమి పండగను మండల ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుడిహత్నూర్‌లోని రామాలయంలో భక్తులతో కిటకిటలాడింది. వివిధ గ్రామాల్లో శ్రీరామ నామస్మరణతో మారు మోగాయి. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆదిలాబాద్‌టౌన్ : శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని వివిధ ఆలయాల్లో జరిగిన కళ్యాణ వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలో ప్రసిద్ధ రామాలయలను దర్శించుకున్నారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనకు సాదరంగా స్వాగతం పలకగా.. స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనాలను స్వీకరించారు. ఈ మేరకు జోగు రామన్న మాట్లాడుతూ శ్రీ రాముని ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. ఆధ్యాత్మిక మార్గంలో నడుస్తూ అనాదిగా వస్తున్న వేడుకలను ఘనంగా జరుపుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు మెట్టు ప్రహ్లాద్, విజ్జగిరి నారాయణ, గోవర్ధన్, వేణు యాదవ్, ధమ్మపాల్, కొండ గణేష్, నల్ల మహేందర్ ఉన్నారు.

నార్నూర్ : శ్రీరామ నవమిని పురష్కరించుకుని ఆదివారం తాడిహత్నూర్ గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. రాములోరికి పట్టు వస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోటగిరి విశాల్, చింతవార్ సత్యనారాయణ, అరవైశ్య జిల్లా అధ్యక్షుడు చింతవార్ రాజు, ఫడ్ విష్ణు, కే.సంతోష్, చకోర్ రాము, రాంకిషన్, చౌలె రాం, బాలాజీ, కే.మహదవ్, రాథోడ్ రాజు ఉన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మావల గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో నిర్వహించిన శ్రీ రామనవమి వేడుకల్లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా ఉదయం స్వామి వారి పల్లకి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పు చప్పుల్ల నడుమ సీత రాముల కళ్యాణన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన శ్రీ రామనవమి వేడుకల్లో శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమల్లో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజి ఎంపిపి గోవర్ధన్, మాజీ ఎన్ఎస్‌యు నాయకులు నరసింహా, సీనియర్ నాయకులు నవీన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కుదురుపాక సురేష్, ప్రేమల, బాలకృష్ణ, లస్మన్న, వెంకటేష్, ముర్తుజా, దినేష్, అడెల్లు, పెటన్న పాల్గొన్నారు.

నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం శ్రీ రామ నవమి సందర్భంగా దేవరకోట ఆలయం నుండి శ్రీరాముడు హనుమంతుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి హిందూ వాహిని, భజరంగ్ దల్ శాఖ ఆధ్వర్యంలో భారీ శోభయాత్ర నిర్వహించారు. పట్టణంలోని పలు వీధుల గుండా హనుమాన్ భక్తులు, యువకులు, చిన్న పిల్లలు జైశ్రీరామ్ జైశ్రీరామ్ అని నినాదాలు చేస్తూ ఈ శోభాయాత్రను కొనసాగించారు.

నిర్మల్ రూరల్ : శ్రీరాముడు ఆదర్శవంతమైన పరిపాలన సాగించాడని, యువత ఆయన ఆదర్శాలకనుగుణంగా జీవనం సాగించాలని ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ వి.శోభారాణి సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఆదివారం సోన్ మండలం శాకెర గ్రామ శివారులోని శ్రీ సత్యనారాయణ గురూజీ ఆశ్రమంలోని శ్రీ రామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా శోభారాణి సత్యనారాయణ గౌడ్ దంపతులు పాల్గొన్నారు. సీతారాముల కళ్యాణాన్ని తిలకించి అక్షింతలు వేసి పురోహితుల ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో గురుస్వామి చిన్నయ్య, ఆశ్రమ సభ్యులు సుదర్శన్, భీంరావు, ఆశ్రమ సభ్యులు సవిన్, పోశెట్టి, నరేష్, గంగాధర్, కాంతారావు, శ్యాంగౌడ్ పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని గోలేటి పారిశ్రామిక ప్రాంతంలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు తలంబ్రాలు స్పెషల్ ఆఫీసర్ వాసుదేవ్ దంపతులు మురళి స్వామి సమర్పించారు. ఖైరిగూడ ప్రాజెక్టు ఆఫీసర్ నరేందర్ దంపతులు తీసుకోవచ్చారు. వేద పండితుల మంత్రోచ్చారణాలు, వాయిద్యాల నడుమ కళ్యాణ క్రతువును నిర్వహజంచారు. కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.













ప్రధాని మోడీతోనే దేశాభివృద్ధి

- ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



పార్టీ జెండాను ఎగరవేస్తున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

ప్రధాని మోడీ, బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాని మోడీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, ఎక్కడో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను 5వ స్థానానికి తీసుకొరావడం మోదీ నాయకత్వం వల్లే సాధ్యమైందన్నారు. ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పార్టీ పటిష్టతకు భారతమాతకు నిస్వార్థ సేవలు చేసి తమ జీవితాలను త్యాగం చేసిన పార్టీ వ్యవస్థాపక సభ్యులు, కోట్లాదిమంది నిస్వార్థ కార్యకర్తలను గుర్తు చేసుకొని వారికి నివాళు లర్పించారు. వికసితభారత్ 2047 లక్ష్యాన్ని సాధించడానికి మనమంతా సంకల్పాన్ని తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, సత్య నారాయణ గౌడ్, మెడిసెమ్మ రాజు, పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించడమే ధ్యేయం

నవతెలంగాణ-మద్నూర్

రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ పాదయాత్ర చేపడుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. ఆదివారం సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన సందర్భంగా మద్నూర్ యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు హనుమంతు యాదవ్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యేతో జైబాపు, జైభీమ్ పోస్టర్లను ఆవిష్కరించారు. పాదయాత్ర ద్వారా గ్రామ గ్రామాన ప్రజల్లోకి వెళ్లాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని ప్రజలంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మద్నూర్ మండల నాయకులతో పాటు నియోజకవర్గంలోని వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం నాయకుడు ఆకుల సంగయ్యను ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్ ఆదివారం పరామర్శించారు. ఆకుల సంగయ్య గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు నేరుగా ఆయన ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. అధైర్యపడవద్దు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మెరుగైన వైద్య చికిత్స చేయిస్తానని ఆయన హామీనిచ్చారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, నర్సింలు, బాలచందు, సాయిరాం, యూసుఫ్, పర్వయ్య, నరేష్, మల్లేశం, వివేకానంద తదితరులున్నారు.

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై చిన్నచూపు తగదు

నవతెలంగాణ-తాడ్వాయి

ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారుల చిన్నచూపు తగదని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు, రాములు, ప్రధాన కార్యదర్శి కొల్లూరి స్వామి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి 2025 సంవత్సరంలో మూల్యాంకనంలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు మాత్రమే డ్యూటీలు వేయాలని, జిల్లాలోని బిచ్కుంద మండలంలో 35 మంది ఉపాధ్యాయులకు డ్యూటీలు వేశారని పేర్కొన్నారు. ఒకే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఇరువురికి డ్యూటీలు వేయడం బాన్సువాడ మండలంలో 42 మంది గాంధారిలో 30 మందికి డ్యూటీ వేశారని ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో విధులు చేపట్టి తిరిగి సివిల్ అసిస్టెంట్‌గా డ్యూటీలు వేయడం వల్ల ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు 20 రోజులపాటు పాఠశాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు కక్షగట్టి ప్రాథమిక విద్యపై నిర్లక్ష్యం చేస్తున్నారని ఇలాంటి కక్షపూరిత వైఖరిని మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాలు చేయాల్సి వస్తుందని పేర్కొన్నారు.

చందాలు చేసి బోరు వేసుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని లింగంపల్లి గ్రామస్తులు చందాలు వేసుకుని బోర్ వేసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి రూ.500 జమ చేసుకొని తాగునీటి కోసం బోరు వేసుకున్నట్లు ఆదివారం పేర్కొన్నారు. అధికారులకు ఎన్నిసార్లు అడిగినా బోరు వేయించలేదని దాంతో తామే డబ్బులు పోగుచేసుకుని రెండు లక్షల 50 వేలు ఖర్చు చేసి బోరు మోటర్ వేయించుకున్నట్టు వివరించారు. అలాగే గ్రామంలోని పురాతన బావిని బాగు చేసుకోవడానికి 30,000 ఖర్చు అయినట్టు తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే స్పందించి బోర్ బావికి మంచినీటికి ఖర్చు చేసిన డబ్బులు మొత్తం 2లక్షల 80వేలు ఇప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మాల సంఘం నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామంలో ఆదివారం మాల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్టు సంఘం సభ్యులు తెలిపారు. అధ్యక్షులుగా మామిండ్ల రాజయ్య, కోశాధికారి మామిండ్ల మోహన్, కార్యదర్శి మామిండ్ల శివరాజు, కార్యవర్గ సభ్యులు మంత్రి లింగం, మామిండ్ల చిన్న సాయిలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సలాబత్‌పూర్ ఆలయాన్ని తీర్చిదిద్దుతా

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయానికి రాష్ట్రంలోనే గుర్తింపు వచ్చేవిధంగా తీర్చిదిద్దుతానని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. ఆలయ అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు మంజూరు చేయించినట్టు తెలిపారు. వెనుకబడ్డ జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని, ప్రస్తుతం ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు భారీగా నిధులు మంజూరు చేయించినట్టు వివరించారు. సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. అంతర్రాష్ట్ర లెండి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తిచేయడంలో గత పాలకులు, అధికారులు పూర్తిగా మరిచిపోయారని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీధర్, ఆలయ అధికారులు, పాలకవర్గం సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పిట్లం తదితర మండలాలకు చెందిన ముఖ్య నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.